సాంప్రదాయాల ముసుగులో బ్రతుకుతున్న అతనికి కనువిప్పు ఎలా కలిగింది?

# గోపుర కలశం

మధుచక్రవర్తి కథ

అపరాత్రి వేళ.

అగ్రహారమంతా, ఆదమరచి నిదురపోతున్న వేళ... ఆ మండువా లోగిలిలో వూగుతున్న ఊయల.. ఇహానికి.. పరానికి మధ్య వూగిసలాడే ఆత్మలా వుంది.

ఊయలబల్లపై వెల్లకిలా ఆచ్ఛాదన లేని గుండెలపై అరచేతులను అడ్డంగా వేసుకుని పడుకున్న దీక్షితులుగారి అంతరాత్మ చేతనానికి అచేతనానికి నడుమ కొట్టు మిట్టాడే జీవుడిలా ఉంది.

అతని జీవితానుభవం గతాన్ని వర్తమానాన్ని తూకం వేస్తున్న త్రాసులా తూగుతూ భవిష్యత్తును బేరీజు వేస్తోంది...

అర్థరాత్రి దాటినా స్థిమితపడని మనసు ఆయన్ని నిద్రపోనీయడం లేదు. రెప్పలు పడని కనులు ఇంటి కప్పును పరికిస్తున్నాయి...

కంటికి ఎదురుగా అందమైన నగిషీతో సునిశితమైన పనితనంతో నిండిన టేకు పరంబీ... దానికిందుగా.. అడ్డంగా.. దృఢంగా పరచుకున్న నల్ల మద్ది దూలం.. ఆ దూలానికి వూయల బల్లను కలుపుతూ వలు వేపులా వేలడుతున్న పటిష్టమైన ఇనుప గొలుసులు... వూయల కదలికలో లయగా కలిగే చప్పుడు...

అంతలో ఓ ఆలోచన....

అంతటి దృఢమైన దూలం విరిగిపోతే..

ఎంతో పటిష్టమైన ఆ ఇనుపగొలుసుల్లో కేవలం ఒక్క లింకు తెగిపోతే...

ఆయన అస్థిమితంగా కదిలారు. ఆ కదలికలో ఆయన చూపులు టేకు పరంబీ నుండి గది గోడల పైకి పరచుకున్నాయి. ఆ



గోడలపై అమర్చిన నిలువెత్తు వర్ణ చిత్రాలు తనను గుచ్చి గుచ్చి చూస్తున్నట్టనిపిస్తోందాయనకి.

వారు...

పరమ నిష్ఠాగరిష్ఠులు... అష్టాదశపురాణాలనూ.. ఉపనిషత్ సారాన్నీ ఔపోశన పట్టిన పండితులు.. నిత్యాగ్నిహోత్రులు.... యజ్ఞ యాగాదులు

గరిపిన సోమయాజులు.

వారు తన పూర్వీకులు....

వారి నిత్య క్రతువులతో.. వేదోచ్ఛరణతో పునీతమైన ఈ లోగిలి అనాదిగా వారు తనకందిస్తూ వచ్చిన మచ్చలేని స్వచ్ఛమైన వంశ చరిత్ర... ఇప్పుడు తన హయాంలో కలుషితం కాబోతున్నాయి...

''ఈశ్వరా'' బరువుగా బాధగా నిట్టూరుస్తూ పక్కకి ఒత్తిగిల్లారాయన. కళ్ళకు ఎదురుగా... నాపరాళ్ళ గచ్చు... ఆ గచ్చు మీద ఠీవిగా ఉన్న వ్యాసపీఠం... దానిలో మూసి ఉంచిన శివపురాణం... దాని పక్కగా కొంగు పరచుకొని పడుకున్న ఇంటి ఇల్లాలు..... తన అర్ధాంగి భ్రమరాంభ...

ఆయన గుండె బాధగా మూలిగింది.

ముప్ఫయ్యేళ్ళ క్రితం ఈ ఇంటి గడపలో కాలు మోపిన దాదిగా ఎన్నడూ తన మాట జవదాటని తనతో మాట మాత్రం లేనిదే గడప దాటని విధేయురాలు.. కష్ట సుఖాల్లో తనకు వేదోడు వాదోడుగా కార్యేషు మంత్రి... కరణేషు దాసిగా నడుచుకుంటు న్న ఉత్తమురాలు...

ఆయన భార్యకేసి అభిమానంగా చూసారు.

ఆ కను రెప్పలు మూసుకున్నా ఆ రెప్పల వెనుక సుళ్లు తిరిగే కన్నీటి జడులను తను చూడగలడు.

నిశ్చింతగా శ్వాసిస్తున్నట్టు కనిపిస్తూన్నా ఆ గుండెల్లో బడబాగ్ని పప్పుళ్లు తన వినగలడు.

ఆయన కదిలారు. లేచి

వూయలబల్లమీది ఖాదీ శాలువాను భుజాల చుట్టూ కప్పుకుని ద్వారం దాటి వాకిట్లో వేప చెట్టు కింద కొచ్చి నిల్చున్నారు..

శుక్లాష్టమి....

వెన్నెల పుచ్చ పువ్వులా విరగకాస్తోంది.

వేప చెట్టు మీది పక్షి గూళ్లలోంచి పక్షుల రెక్కల చప్పుళ్లు వినిపిస్తున్నాయి.. వేప కొమ్మల సందుల గుండా జాలువారుతున్న వెన్నెల, నేలపై వెలుగు నీడల్ని చిత్రిస్తోంది. ఉండి ఉండి వీస్తోన్న గాలి పొరల్లో వేప పూల పరిమళం గుభాలిస్తోంది... పిట్ట గోడపైకి పాకి చరుగాలికి చిన్నగా కదులుతూ, చిద్విలాసంగా చిరునవ్వు చిందిస్తున్నట్టున్న గుమ్మడి పువ్వు సర్వం తెలిసిన జ్ఞానిలా.. సృష్టి రహస్యం ఛేదించిన యోగిలా ఉంది.

ఆయన తలతిప్పి ఉత్తర దిక్కుగా చూశాడు.

దూరంగా వెన్నెల్లో మసగ్గా ఎత్తుగా కనిపిస్తోన్న మార్కండేయాలయం తపోనిష్టలో ఉన్న మునిలా ఉంది.

ఆయన నెమ్మదిగా ఆలయంకేసి నడిచారు.....

పురాతనమైన ఆలయ ప్రాంగణం ఏదో అలౌకిక అభౌతిక భావనని కలిగిస్తోంది. ముఖ మంటపం దగ్గర కొచ్చేసరికి ఆయన ఆగిపోయారు. స్తబ్దత అలుముకున్న ఆ మంటపంలోని రాతి స్తంభాలే ఆ నాటి అసుర సంధ్యా వేళలో జరిగిన ఓ తండ్రి తనయుల జీవన్మరణ సమస్యా సంవాదానికి సాక్షులు... ప్రేక్షకులు...

అక్కడ ప్రతి స్తంభంలోనూ ఆ వాగ్వివా


దం ఇంకా ప్రతిధ్వనిస్తున్నట్టే అవి పిస్తోందాయనకి....

"అయితే నీ నిర్ణయం మారదా మార్కండేయా.. తండ్రిగా నా మాటకు మన్నిచ్చే విలువింతేనా?

"క్షమించండి నాన్నగారూ నా నిర్ణయానికి మీకు నేనిచ్చే విలువకీ ముడి పెట్టకండి. మీరన్నా మీ వ్యక్తిత్వమన్నా నాకెనలేని గౌరవం... అయితే ఇది కేవలం నా వ్యక్తిగత సమస్య. నాక్కాబోయే జీవిత భాగస్వామిని ఎన్నుకునే అవకాశం హక్కు నా కొక్కడికే ఉండాలని నా ఉద్దేశ్యం... అంతేగానీ మిమ్మల్ని కించపరచడం నా అభిమతం కాదు..."

"బాగుంది బాబూ.... చాలా బాగుంది.. నీ కోణంలో నీ వాదన సబబుగానే ఉంది. మరి తండ్రిగా నావైపునుంచి కూడా ఆలోచించు... ఇంతకాలం ప్రాణప్రదంగా కాపాడుకుంటూ వస్తున్న ఈ వంశ గౌరవ ప్రతిష్టల్ని నాశనం చేసే హక్కు కూడా నీకే ఉందంటావా.. చెప్పు బాబూ..."

"సమాధానం మీకు తెలీకే నన్నడుగుతున్నారా నాన్నగారూ... వంశ ప్రతిష్టలనేవి ఆచార సాంప్రదాయాలకు సంబంధించినవి.. ఆచార సంప్రదాయాలనేవి సంస్కృతీ నాగరికతలకు సంబంధించినవి. అయితే ఇవన్నీ పరిణామ శీలమైనవి. అంటే అవి తరతరానికి కొద్దో గొప్పో మారుతూ ఉంటాయి.. అసలు అలా మారుతూనే ఉండాలి.. అలా కాకుండా ఉండి ఉంటే మనమింకా రాతి యుగంలోనే ఉండి ఏ కొండ గుహల్లోనో చెట్ల గుబురుల్లోనో మగ్గుతూ దొరికిన జంతు జాలాన్నీ కందమూలాల్నీ తింటూ ఇంకా ఆటవిక ఆదివాస జీవనాన్నే సాగిస్తూ ఉండేవాళ్ళం. ఒక తరంలో సంప్రదాయమైన 'సతీసహగమనం' మరో తరంలో అమానుష చర్య అయింది. అలాగే ఈ తరంలో నీచం... హీనం... నేరం...



ఘోరం అనిపించేవి రామన్న తరాల్లో ఉన్నతమైన ఉదాత్తమైన చర్యలుగా గొప్ప కార్యాలుగా గుర్తింపు పొందవచ్చు... అందుచేత...''

''ఆగు మార్కండేయా.. ఆగు పరిణామ సిద్ధాంతానికీ నీ ప్రణయ ప్రహసనానికీ లంకె వేయకు. నా గుండెల్లో పేరుకుపోయి నన్ను వేధిస్తున్న బాధల్లా నిలువెల్లా దహించి వేస్తున్న సమస్యల్లా ఒక్కటేనయ్యా.. ఒకటే... తరతరాల స్వచ్ఛమైన వంశ చరిత్రకీ... సంత్సంప్రదాయానికీ స్వచ్ఛమైన వంశ చరిత్రకీ... సంత్సంప్రదాయానికీ సనాతనత్వానికీ వారసుడిగా ఓ అంటరాని పిల్లని నియమ నిష్టలకు నిలయమైన ఈ శుద్ధ శ్రోత్రియ వంశంలోకి ఇంటి కోడలుగా ఆహ్వానించి ఈ పవిత్ర లోగిలిని మైలపర్చి నా పితృపితామహుల ఆత్మలకు క్షోభ కలిగించలేను నాయనా.. క్షోభ కలిగించలేను.''

''క్షమించండి నాన్నగారూ.. ఈశ్వర వాదులు.. శివారాధకులైన మీకు నేను వేరే చెప్పాలా...''

''విద్యా వినయ సమ్పన్నే బ్రాహ్మణేగ విహస్తిని.

శుని చైవశ్వపాకేచ పణ్డితాస్సమదర్శిన''

''అవును నాన్నగారూ.. ఈ సృష్టిలో సర్వం ఈశ్వరమయం అయినపుడు ప్రతిదీ ఈశ్వర పదార్థమే అవునుడు ఇక మీరంటు న్న అంటరాని తనానికి తావేది.

''నాయనా... మార్కండేయా.. నీ తెలివితేటలతో తర్కంతో.. వాదనలో నన్ను ఒప్పించి ఓడించ గలవేమో గానీ నా గుండెల్లో రగిలే మంటను చల్లార్చలేవు.:...

నా ఆత్మను శాంతింప చేయలేవు. చూడు బాబూ ... నీతో వాదించగలిగే... నిన్ను ఓడించగలిగే, శక్తియుక్తులు నాకు లేకున్ననీకు జన్మనిచ్చిన వ్యక్తిగా నీ కన్నతండ్రిగా నీపై ఆశలు పెట్టుకున్న పెంచుకున్న దీనుడిగా నిన్ను ఒకే ఒక వరం అర్థిస్తున్నాను... 'వర్ణసంకరం' తలపెట్టకు నాయనా.. నువ్వు నాకు తల కొరివి పెట్టి నన్ను పున్నామ నరకం నుండి తప్పించకపోయినా బాధపడనుగానీ వర్ణ సంకరం చేయించి కులభ్రష్టం గావించాననే అపవాదు మాత్రం రానీయకయ్యా— ఇది స్వార్థమే అనుకో మరేదైనా అనుకో.. ఆ మేరకు నాకు మాటివ్వు బాబూ... ఇవ్వలేని పక్షంలో ఇక ఆత్మహుతే నాకు శరణ్యం''

''అంతమాటనకండి నాన్నా... ఒకర్ని బాధపెట్టాలనీ... బలి పెట్టాలని కాదు ఈ నా ప్రయత్నం... మనిషి మనుగడకు సరికొత్త ఎల్లలు చూపించాలనే సత్సంకల్పం మాత్రమే అభ్యుదయ భావాలతో కాంతిపథం వేపు పయనిస్తున్న నాలో తిరోగమన బీజాలు నాటి నన్ను తిమిరంలోకి తోయకండి. పశ్చిమాద్రికి పయనించే తరం మీది.. తూరుపుకి ఉరికే తరం మాది. మీకు కొత్తగా ఇవ్వవలసిన మాట కోసం నేనిదివరకే మనసిచ్చిన మాటిచ్చిన అమ్మాయిని మోసం చెయ్యలేను... నన్ను క్షమించండి... నివరగా నేను చెప్పేదొక్కటే నాన్నగారు... నా నిర్ణయం మార్చుకునే ప్రసక్తే లేదు. పోతే విశాల దృక్పథంతో మీరు నన్ను అర్థం చేసుకోగలిగి నా కొడుకు ఆదర్శ



అంధభావాల

భావంతో అభ్యుదయ పంథాలో ఓ అంటరాని అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని పది మందిలో గర్వంగా చెప్పుకోగలిగితే, చెప్పుకోండి. అది సాధ్యం కానప్పుడు అసలు మీకు కొడుకే పుట్టలేదనీ పుట్టినా ఏనాడో చచ్చిపోయేడనీ అనుకోండి. వివాహానంతరం నా భార్యతో వచ్చి మీరు అనుకుంటున్నట్టుగా భయపడుతున్నట్టుగా మన ఇంటిని మైల పర్చనని మాత్రం మాటిస్తున్నాను.. వస్తానునాన్నా.. వస్తాను.. సెలవ్.."

... రివ్వున వీచిన దక్షిణపు గాలికి ఆలయ ప్రాంగణంలోని ఎండుటాకులు గల గలా శబ్దం చేసుకుంటూ దొర్లాయి. ఆలోచనల్లోంచి తేరుకున్న దీక్షితులుగారు బరువుగా నిశ్వసించి కనులు తెరిచి చూశారు....


అంతటా అలుముకున్న నీరవ నిశ్శబ్దం...

వెన్నెల మసగ వెలుగులో మంటపంలోని రాతి స్తంభాలుముక్కోపి గురువు ముందు ఊపిరి బిగపట్టి నిల్చున అమాయకపు శిష్యుల్లా బిక్కు బిక్కు మంటున్నాయి... నీలాకాశంలోని చంద్రుడుసుఖ దుఃఖాలకు అతీతుడిలా నిండుగా నవ్వుతున్నాడు. దూరంగా మెట్లపై మంచి ఎవరో నిదురపట్టని బైరాగి పాడుతున్న తారకామృత సారతత్వం గాలిపొరల్లో తేలివస్తూ ఎదలో ఏదో అలౌకిక అభౌతిక ఆధ్యాత్మిక భావాల్ని కదిలిస్తోంది.

"బైరాగివైనా... బికారివైనా.. బిచ్చగాడివైనా ఎంతటి అదృష్టవంతుడవోయి నువ్వు...."

అలసటగా కదిలారు దీక్షితులుగారు..

ఈ మంటపంలోనే ఎంతో మందికి తను ఎన్నో యేళ్ళుగా ఎన్నో ధర్మసూత్రాలు వల్లించాడు.. ఎన్నెన్నో సమస్యలకు పరిష్కారాలు సూచించాడు.. మరెన్నో అర్థాలు.. జీవిత పరమార్థాలు బోధించాడు. జీవితంలో అలసి జీవితంతో విసిగిన వాళ్ళలో జీవనలాలస కలిగించాడు. జీవితపు వెలుగులు వెలిగించాడు.. జీవించాలనే తపన రగిలించాడు.. అటువంటిది తనకు పుట్టి తన దగ్గర పాఠాలు నేర్చిన కొడుకు తనకన్నా వయసులోనూ– అనుభవంలోనూ ఎన్నో రెట్లు చిన్నవాడు... ఇన్నాళ్లకు మళ్లీ తనకే వర్ణ వ్యవస్థ వర్ణాశ్రమ ధర్మాలు విశదీకరిస్తున్నాడు... మంత్రపుష్పం



## పోట్లాట

"ఏహోయ్ రాజేష్ రోజు మీరు మీ ఆవిడ పోట్లాడుకుంటుంటారు. కొత్త దంపతులు దెబ్బ లాడుకోకూడదోయ్" అడిగాడు ఎదురింటి ఏకాంబరం.

"ఆ ఏం చెప్పమంటారు. మా ఇంటావిడ మహా మువ్వాలి. అద్దెకున్నవాళ్ళు పచ్చగావుంటే చూసి ఓర్వలేదు. ఇల్లు ఖాళీచెయ్యమని గొడవచేస్తుంది. అందుకే అలా వుత్తిత్తినే పోట్లాడుకుంటాం" చెప్పాడు రజేశ్

—కె. వెంకటరామ అక్కయ్య
(కంకిపాడు)

అప్పచెప్పమంటే ముచ్చెమటలు పోసి ముప్ఫయి చెరువుల నీళ్ళు త్రాగి గోచీ తడుపుకున్న మార్కండేయులూ ఎంతటి వాడి వయ్యావురా.

ఇంతకాలంగా ఇంతమంది అగ్రహారికుల ముందు పెద్ద పీట వేసుక్కూర్చున్న వా పెద్దరికం ఇక ముందు ఏం కావాలి?

ఎంత పని చేసేవురా మార్కండేయులూ.. నీకిది తగదురా'' మూగగా రోదించింది దీక్షితులుగారి ఆత్మ.

అంతలోనే ఏదో నిర్ణయానికి వచ్చినట్టు దీర్ఘంగా నిట్టూర్చి గర్భ గుడికేసి తిరిగి సాష్టాంగ ప్రణామం చేసాడాయన. చాలా సేపటికి లేచి మెట్లకేసి కదలబోతూ దక్షిణ దిశ వైపు తల తిప్పిచూసారు.. దూరంగా.. తను పుట్టి పెరిగి ఇంతకాలం మసలిన ఎన్నో స్మృతులకు నిలయమైన మందువా లోగిలి వర్షా నంగా రోదిస్తున్న మాతృమూర్తిలా కనిపించింది.

ఆయనకు భార్య గుర్తొచ్చింది—

అర్థేచా....

కామేచా...

మోక్షేచా...

త్వయైసా...

నాతి చరితవ్య...

నాతిచరామి...

''క్షమించు భ్రమరం''

మనసులో పదాలను ఆయన పెదవులు అస్పష్టంగా ఉచ్చరించాయి.

ఆర్ద్రతతో ఆయన కనులు చెమ్మగిల్లాయి.

అంతే!

వెనుదిరిగి వడివడిగా మెట్లు దిగడం ప్రారంభించారు. మెట్లు దిగవున ప్రవ హిస్తూవన్న గోదావరి హోరు లీలగా వినిపిస్తోంది...

ఆయన పాదాలు కదులుతున్నాయి.

కదులుతున్న ఆయన పాదాలు ఆ మెట్టు పైకి వచ్చే సరికి ఆగిపోయాయి...

అక్కడ...

ఆ మెట్టుపై...

ఓ పక్కగా తలకిందుగా రెండు అరిచేతులు దిండుగా బోర్లించి పెట్టుకుని పక్కకి ఒత్తిగిల్లి పడుకుని ఉందో స్త్రీ...

పచ్చని దేహచ్ఛాయ... పాతదైనా... చిరుగు పట్టినదైనా... శుభ్రంగా ఉతకి కట్టిన నేత చీర.. తలపై అక్కడక్కడా నెరసిన కేశాలు...

రామునికై ఎదురుచూస్తున్న శబరిలా...

ఆడి ఆడి అలసి సొలసి ఆద మరచి నిదురపోతున్న పసిపాపాయిలా ఎంతో ప్రశాంతంగా పవిత్రంగా ఉన్న వదనం...

ఆమె పక్కనే పరచిన తెల్లటి వస్త్రం...

దానిపై ఉంచిన చిన్ని శివలింగం...

ఆ లింగం చుట్టూ చల్లిన నందివర్ధన పారిజాత పుష్పాలు...

సన్నని గాలి తెర... అతని ముఖాన్ని మృదువుగా స్పృశించింది....

'పా.... వ...నీ...''

గుండె దాటి.. గొంతు దాటిన ఆ పేరును అస్పష్టంగా గొణిగాడాయన...

నందివర్ధన పారిజాత పుష్పాల పరిమళం. అతని అనుభవాల అలల్ని సుతారంగా

కదిలించాయి...

* * *

లేడిలా.. సెలయేటిలా...
సెలవు లిచ్చిన బడి పిల్లాడిలా...
ఉరకలేసే వరద గోదారిలా...
వయసు లేపే వరద గోదారిలా..
వయసు పరుగులిడుతున్న రోజులవి...
గాజులన్నా... జాజులన్నా....
మేఘాలన్నా.. మోహన రాగమన్నా..
మోజు కలిగించిన రోజులవి....
శ్రీనాథుణ్ణి... కాళిదాసుని
ఆరాధిస్తున్న రోజులవి...

* * *

కార్తీక పౌర్ణమి...

వేకువజామునే గోదారి స్నానాల రేవు కలకలంగా... కోలాహలంగా ఉంది.. శివారాధనకు వెళ్లే ఆడంగుల స్నానాలతో..

అప్పటికే సంధ్యా వందనాది కార్యక్రమాలు పూర్తిగావించుకుని ఆలయానికి బయల్దేరారు శివ శంకరశాస్త్రిగారు.

నుదుట విభూతి రేఖలతో మెడలో రుద్రాక్ష మాలలతో విశాల వక్షంపై అడ్డంగా పరచుకున్న యజ్ఞోపవీతంతో.. అపర పరమేశ్వరుడిలా.. ఆది శంకరుడిలా... దక్షిణ హస్తంతో తళతళలాడే ఇత్తడి తీర్థపు పాత్రతో ఆ ఆజానుబాహుడు, పెద్దపెద్ద అంగలతో, ఠీవిగా నడచివెళ్తుంటే అక్కడి వారందరూ ఓ యజ్ఞపురుషుణ్ణి చూస్తున్నంత భక్తిభావంతో... విధేయతతో ఆయనకు నమస్కరిస్తున్నారు.

ఆయన అలా నడుస్తూ.. నడుస్తూ... మధ్య... మధ్యలో వెనక్కి తిరిగి చూస్తూ..... "దీక్షితులూ త్వరగా రా నాయనా... సంప్రోక్షణకు సమయం మించుతోంది.. అందులోనూ ..... ఈ రోజు కార్తీక పౌర్ణమి కూడాను.. ఆలయంలో చేయాల్సినపనులు చాలా ఉన్నాయ్"

## బెంచీ మహిమ



డాక్టర్ క్రిస్టియన్ బెర్నార్డ్ ప్రముఖ వైద్యులు! గుండె మార్పిడి ఆపరేషన్ చేసిన ప్రథములలో ఒకరు. ఆయన కేప్ టౌన్ విశ్వ విద్యాలయంలో చదువుకొనేటప్పుడు ఫిజిక్స్ క్లాస్ నుండి వరుసగా రోజు కొక బెంచీలో విద్యార్థుల్ని బహిష్కరిస్తూ ఉండేవాడట లెక్చరర్. బెర్నార్డ్... ఆ బహిష్కరణ తప్పించుకోందామని రోజుకొక బెంచీలో కూర్చునేవాడట. అతని దురదృష్టంకొద్దీ... అతడు కూర్చున్న బెంచీలో ఓ విద్యార్థి గొడవ చేయటం— మొత్తం ఆ బెంచీలో ఉన్న విద్యార్థులందర్నీ బహిష్కరించటం జరుగుతూ ఉండేదట! అలా చాలాసార్లు ఆనాడు అనవసరంగా శిక్ష ననుభవించాడట... నేటి ప్రముఖ డాక్టర్.

—జూపిటర్

అంటూ కొడుకుని హడావుడి చేస్తున్నారు.

ఎడమ భుజాన తడి అంగవస్త్రంతో కుడి భుజాన తీర్థపు బిందెతో.. కాసె పోసిన పంచకట్టుతో దబ్బ పండు దేహచ్ఛాయతో... పట్టుమని పంతొమ్మిదేళ్లులేని దీక్షితులు తండ్రి వేగాన్ని అందుకో లేకపోతున్నాడు...

అయితే అందుక్కారణం. నడవలేక.. నడకరాకా కాదు.. యమునా నదిలో జలకాలాడుతున్న గోపికల్లా... రేవులో స్నానాలాడుతున్న అగ్రహారపు అమ్మాయిల అంగాంగాలు, తడిసిన వస్త్రాల్లోంచి పారదర్శకంగా పరమ దర్శనీయంగా కనువిందు చేస్తుంటే పాపం దీక్షితులి పాదాలు తడబడి పెదాలు తడారిపోతున్నాయి.

అప్పుడే తొలియవ్వనంలోకి అడుగిడిన దీక్షితులి మనసు ఈ మధ్య చంచలంగా ఉంటోంది...

దేవీ స్తోత్రాల్లో, అమ్మవారి అంగాంగ వర్ణనలే కళ్ళలో మెదులుతున్నాయి. ఆలయ శిల్పసంపదలో శృంగార భంగిమలే సాక్షాత్కరిస్తున్నాయి.. శివారాధనకు వచ్చే ఆడంగుల తడి వస్త్రాల్లోంచి తొంగి చూసే అందాల్ని దొంగ చూపులు చూడటం పరిపాటయింది.

గర్భగుడిలో ఏ మాత్రం ఏకాగ్రత కుదరడం లేదు... మళ్లీ తండ్రి అదలింపుతో స్పృహలోకి వచ్చి వడివడిగా అడుగులేశాడు దీక్షితులు...

గుడి మెట్లెక్కుతుంటే మళ్ళీ గుండె లయ తప్పింది దీక్షితులుకి.

మెట్ల పక్కగా పారిజాతపూలు యేరుతూ కనిపించింది పావని

మునికన్యలా.. వనకన్యలా... కణ్వాశ్రమంలోని శకుంతలలా కనిపించింది అతడి కళ్ళకి. ఒక్క శంకుతల ఏమిటి? తను చదివిన అందరు ప్రబంధ కావ్య నాయకిలు ఆమెలో కనిపించారతడికి.

మూడు నెలలుగా చూస్తున్నాడామెను. అంధురాలైన వృద్ధ తల్లితో ఆలయ ప్రాంగణంలోనే ఉంటూ రోజూ ప్రాతఃకాలన్నే పూలుయేరి మాలలు కట్టి శివారాధన వేళకు అందిస్తుంది. క్రమం తప్పకుండా తన దిన చర్యను పాటించే పావని అంటే తన తండ్రికి ఎనలేని వాత్సల్యం. అందుకే భక్తులు సమర్పించే కానుకల్ని ప్రసాదాల్ని పిలిచి మరీ ఇస్తుంటారు.

తొలి చూపులోనే ఆమె పట్ల ఆకర్షితుడయ్యాడు దీక్షితులు. ఆమె రూప లావణ్యాలు.... ప్రవర్తన... సంభాషణలు అతడ్ని ఆమెపట్ల అనురక్తుడ్ని చేసాయి.

ఆ రోజు...

సంధ్య దీపం వెలిగించక మునుపే వొంట్లో నలతగా ఉండటంతో పెందరాళే వెళ్ళిపోయారు శివశంకర శాస్త్రిగారు.

ఆయన వెళ్ళాక — ఆలయ విధులు నెరవేర్చుకుని నీరాజన మంత్ర పుష్పాది కార్యక్రమాలను పూర్తిగావించుకుని ఆలయం మూసి గృహోన్ముఖుడయిన దీక్షితులు ముఖ ద్వారం కేసి నడుస్తూ మంత్రం వేసినట్టుగా ఆగిపోయాడు.

ఈశాన్యదిక్కుగా... మసక చీకట్లో. బావిగిలక చప్పుడు బావి పక్కగా అభ్యంగ స్నానమాచరిస్తూ పావని!

వర్షిస్తున్న కారు మేఘాల్లా... మూర్ధాంతుల ఆమె మోమును కప్పేస్తూ నీళ్లు కారుతున్న నల్లని కేశాలు... వాటి కిందుగా కఠినమైన పాపి కొండల్ని జ్ఞప్తికి తెస్తూ సమోన్నత కుచద్వయం... ఆ పాపికొండల నడుమ నిర్దాక్షిణ్యంగా నలిగి క్రుశించి నీరసించిన సన్నటి గోదావరి పాయలా శుష్కించిన నడుము... ఆ గోదావరి పాయకు ఇరువైపులా విశాలంగా పరచుకున్న ఇసుక తిన్నెల్లా... ఘనమైన జఘన భాగం.. సృష్టిలోని సౌందర్యాన్ని.. స్త్రీత్వాన్ని పోతపోసినట్టు... స్నిగ్ధంగా.. ముగ్ధంగా... అర్ధనగ్నంగా... ఇది కలా.. నిజమా... అనిపించేలా, అలా ఆమె కనిపించే సరికి దీక్షితులు నిలువలేక పోయాడు. నిగ్రహించుకోలేక పోయాడు. మంత్ర ముగ్ధుడిలా.. మదనోన్మాదిలా ముందుకు అడుగు వేశాడు.

ఆలయ ద్వారం కేసి కాదు.. ఆమె కేసి..

పురుషవాసన పసిగట్టిన ఆ పదహారేళ్ళ కన్నె శరీరం... ఒక్కసారిగా వొణికింది. సిగ్గు భారంతో కుంచించుకుపోయింది.

దీక్షితులు అడుగు అడుక్కీ ఆమెకు దగ్గరౌతున్నాడు...


ఎదురుగా మూర్తీభవించిన రతీదేవిలా పావని...

ఆమె కళ్ళలో అభ్యంతరమూ లేదు, ఆహ్వానమూ లేదు...

అంతే... ఆపలేని తమకంతో ఆమెను హత్తుకుపోయాడు దీక్షితులు...

ఆమె ప్రతిఘటించలేదు... ప్రోత్సహించనూ లేదు. ప్రతిమలా పలుకు లేకుండా నిలుచుండిపోయింది. దీక్షితులు ఆమెను పొదివి పట్టుకుని చెంతనున్న రాతి గట్టున చేర్చి ఉరికే జలపాతంలా ఆమెను ఆక్రమించుకున్నాడు.

ఆ కటిక రాతి నేలపై ఆ కోమల శరీరాన్ని అదుపులేని తమకంతో పెనవేసుకున్నాడు. ఆ గాఢ పరిష్వంగంలో పరస్పరం తొలి స్త్రీ పురుష



ప్వర్శాసుఖానుభూతుల్ని అనుభవిస్తున్నారు.. ఆ రెండు శరీరాల రాపిడి... ఒరిపిడిలోంచి ఆవిర్భవించే యవ్వనపుటావిరి...

అక్కడ కుల గోత్రాల పట్టింపు లేదు...

పరువు ప్రతిష్టల ప్రసక్తి లేదు...

పేదా గొప్ప తారతమ్యం లేదు..

తప్పొప్పుల వ్యత్యాసం లేదు...

మంచి చెడుల విచక్షణ లేదు...

ఉన్నదల్లా.. సృష్టి రహస్యన్ని ఛేధించాలనే తపన... సుఖాల అంచుకు చేరాలనే తహతహ...

స్త్రీత్వంలో సంపూర్ణంగా ఐక్యమైపోవాలనుకునే పురుషత్వపు పోరాటం.. పురుషత్వాన్ని సంపూర్ణంగా తనలో ఇముడ్చుకోవాలనుకునే స్త్రీత్వపు ఆరాటం.

గర్భగుడిలో సైతం లభ్యంకాని ఏకాగ్రత ఆ ఇద్దరిలోనూ ...

అదొక నిర్విరామ తపస్సు...

అలా.. కొన్ని క్షణాలనంతరం అలసి సొలసి సేద తీరుతున్నట్టు నిశ్చలంగా ఉండిపోయాయా రెండు దేహాలు...

'యెన్నో ఏళ్ళ కఠోర తపస్సుకి మోక్షం లభించిన తృప్తి వడగాలికి తడారి బీటవారిన నేలపై కుంభవృష్టి కురిసిన హాయి....

అదొక అద్వైత స్థితి... అనిర్వచనీయ రస స్థితి...

ఆ రసాస్వాదనలోంచి ఆ తాదాత్మ్యంలోంచి తేరుకున్నాక అన్నాడుదీక్షితులు..

"పావనీ.. నువు నాకు కావాలి.. ఈ సుఖం ఎప్పటికి నాదికావాలి... నిన్ను విడిచి ఉండలేను పావనీ.. . నిన్ను... నిన్ను నా దాన్ని చేసుకోవాలనుకుంటున్నా..." అతని మాటలు ఇంకా పూర్తి కాలేదు.... ఆమె ఆర్తిగా ఆందోళనగా అతడి ముఖాన్ని తన గుండెలకేసి అదుముకుని—

"వద్దండి.. వద్దు.. అంతటి పేరాశ ఈ పేదరాలికి లేదండి... లేదు.. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఈ మాత్రం అదృష్టానికి నోచుకున్నాను. మీ కలయికతో ఏ మాత్రం ఉనికి లేని నా జన్మకు ఒక అస్తిత్వాన్ని కలిగించారు.. ఒక సార్థకత ప్రసాదించారు.

సనాతన వంశంలో పుట్టి... నియమ నిష్టలతో పెరిగి, దైవార్చనకు అంకితమైన మీ పవిత్ర దేహం.. చరిత్ర లేని నా ఈ శరీరాన్ని తాకడమే ఒక అపూర్వమైన వరం... ఈ జన్మకి ఈ అనుభవం.. ఈ అనుభూతి చాలండీ.. జీవితాంతం గుండెల్లోంచి పదిలంగా దాచుకోడానికి.. అంతేకాని... అంతకుమించి నా కారణంగా మిమ్మల్ని భ్రష్టు పరిచేటంత స్వార్థం నాకు లేదండీ...

నా స్థానం మరచి ప్రవర్తించి నన్నెంత ఆదరంగా అభిమానంగా చూసుకునే మీ తండ్రిగారి ఆగ్రహానికి గురి కాలేనండీ.... శాస్త్రాలు చదివినవారు... మీకు చెప్పేటంతటి దాన్ని కాను... అయినా అడుగుతున్నాను.. మీరు ఈ క్షణం తీసుకున్న ఈ నిర్ణయం జీవితాంతం నిలుపుకోగలరా... చెప్పండి... నాకు తెలుసండీ.... ఈ తృష్ణ, ఈ ఉద్రేకం

చల్లారాక నాటితోపాటుగా మీ నిర్ణయం కూడా సడలిపోతుందండీ... అప్పుడు మీరే మీ తొందరపాటు నిర్ణయానికి పశ్చాత్తాపంతో బాధపడతారు... జీవితాంతం కుమిలిపోతారు. అది నేను భరించలేనండి... భరించలేను.

ఇంత సూటిగా మాట్లాడుతున్నందుకు నన్ను క్షమించండి... నేను నన్నూ, నా పుట్టుకనీ... నా స్థాయినీ దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతున్నాను.. అంతేగాని మీ నిజాయితీని శంకిస్తున్నాననుకోకండి.. మీరు అంతగా మనసా వాచా నన్నే కోరుకున్న వాడు నా సాహచర్యం ఆశించినవాడు మీ సేవలకి జీవితాంతం ఎదురు చూస్తుంటానండీ.. నన్ను నమ్మండి..."

...ముప్పయి యేళ్లుగా గుండెల్లో నిక్షిప్తమైపోయిన రహస్యానుభూతి ఒక్కసారిగా ఉప్పెనలా ఉరికింది దీక్షితులుగారి గుండెల్లోంచి..

చెమ్మగిల్లిన కనులతో ఆమె వేపు అపరాధిలా చూసారు దీక్షితులుగారు...

అవును.. ఆమె మాట తప్పలేదు...

తొందరపడి ఎక్కడా పెదవి విప్పలేదు.

కులం లేకపోయినా వంశ చరిత్ర లేకపోయినా....

తనవారంటూ ఎవరూ లేక అనాదిగా మిగిలినా...

ఆమె మాట తప్పలేదు...

ఏ దుర్భర పరిస్థితులకు లొంగి.. నైతికంగా పతనం కాలేదు.. ఈ నిజాన్ని ఈ రహస్యాన్ని ఇన్నాళ్లూ తన గుండెల్లోనే దాచుకుని ఈ నాటికీ పవిత్ర పూజాపుష్పంగానే ఉంది...

మరి తను?

గొప్ప చరిత్రగల వంశంలో పుట్టినా... వేదపారాయణ చేసినా..

నిత్యం శివసాన్నిధ్యంతో గడిపినా...



## రెండు

జగదానందం, బ్రహ్మానందం మాట్లాడుకుంటున్నారు—

"ఒరేయ్ జగదానందం... నీకు రెండు కార్లుంటే నాకోకారు ఇస్తావా?" అడిగాడు బ్రహ్మానందం.

"ఒ.కె. అలాగే" అన్నాడు జగదానందం.

"నీకురెండు టీవీలుంటేనాకోటి ఇస్తావా"

"ఒకె అలాగే"

"నీకు రెండు చొక్కాలుంటే నాకోటి ఇస్తావా?" అడిగాడు బ్రహ్మానందం.

"అమ్మా.. ఇవ్వను" అన్నాడు జగదానందం

"ఏం.. ఎందుకని!"

"నాకున్నవి రెండు చొక్కాలే" దీనంగా చెప్పాడు జగదానందం

—కె.వెంకటరామ అక్కయ్య
(కంకిపాడు)

విచక్షణ లేకుండా... తుచ్ఛమైన క్షణికమైన వాంఛకోసం నిర్దాక్షిణ్యంగా ఓ నిండు జీవితాన్ని నిస్సారం చేసాడు... తన కామాగ్నికి సమిధను చేసాడు.

ఆచార సాంప్రదాయాల ముసుగులో అవకాశవాదిలా, పిరికివాడిలా... మాట తప్పి మరో పెళ్ళి చేసుకున్నాడు. కనీసం మానసికంగానైనా ఆమెకు అండగా నిలువ లేకపోయాడు...

ఎవరు సంస్కారవంతులు?

ఎవరు సంస్కార హీనులు?

స్వచ్ఛమైన ఆమె వ్యక్తిత్వం ముందు తుచ్ఛమైన తనవ్యక్తిత్వం ఏ పాటిది?

కులం లేని ఆమె ముందు... ఆమె ఔన్నత్యం ముందు గొప్ప కులం... వంశ ప్రతిష్ఠ గల తను ఏవిధంగా గొప్పవాడు.

అతనిలో అంతర్మథనం...

అంతరాంతరాల్లో ఆత్మ ప్రక్షాళనం...

...అసతోమా. .సద్గమయా...

తమసోమా.. జ్యోతిర్గమయా

మృత్యోర్మా... అమృతాంగమయ.

వేకువపువ్వు మెల్లగా విచ్చుకుంటోంది..

వెలుగు రేఖలు మందంగా పరచుకుంటు న్నాయి.. చెట్ల మీది పక్షులు రెక్కలు టపటప లాడించుకుంటూ కూటి కోసం ఎగురు తున్నాయి.... తనకంటే ఎంతో ఎత్తుకు ఎగురుతున్న పిల్లల్నిచూసి తృప్తిగా నిట్టూరుస్తున్నాయి రెక్కలు అలసిన ముసలి పక్షులు...

ఆలోచనల నుండి తేరుకున్న దీక్షితులుగారికి, ఎదురుగా.. ఎత్తుగా గుడిగోపురం ఆ గోపురంపై మెరిసే కలశం కనిపించాయి..

ఆ క్షణం.. ఆ గోపురంలో ఆ కలశంలో.. ఆయనకి తన కొడుకు మార్కండేయులు ఎంతో ఎత్తుకు ఎదిగిన అతని వ్యక్తిత్వం వామనుడి విశ్వరూపంలా కనిపించాయి.

*



చిత్రం: పి.ఎల్.బలరామ్ (వారాసిగూడ)